అర్హులకు అందని కౌలు కార్డులు



సాయన్నపాలెంలో ముంపు బారిన వరి పొలంలో కౌలు రైతు



కురెళ్లగూడెంలో కౌలు రైతులకు సాగు హక్కు పత్రాలను అందిస్తున్న ఏడీఏ ఉషారాజకుమారి, ఏవో

- మందకొడిగా సాగు హక్కు పత్రాల పంపిణీ
- పంట రుణానికి మోకాలు అడ్డు
- భీమడోలు సబ్ డివిజన్ పరిధిలో 63 శాతం

భీమడోలు: జిల్లా వ్యాప్తంగా కౌలు సాగుహక్కు పత్రాల పంపిణీ మందకొడిగా సాగుతోంది. గతేడాది మే నెల నుంచి సాగు హక్కు కార్డులను పంపిణీ చేయగా ఈ ఏడాది పంపిణీలో జాప్యం జరుగుతోంది. ఖరీఫ్ సాగు ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నా కార్డులు చేతికందని పరిస్థితితో రైతులు ఆందోళన చెందుతున్నారు. సార్వా సాగు ప్రారంభించిన కొన్ని రోజులకే అకాల వర్షాలకు వందలాది ఎకరాల్లో పంట ముంపుబారిన పడి రైతులు, కౌలు రైతులు తీవ్ర ఆర్థిక నష్టాన్ని చవి చూశారు. దీనితో మరోసారి అప్పులు చేసి సాగు ప్రారంభించాల్సిన దుస్థితి నెలకొంది. కౌలు రైతులు పంట సాగుకు బ్యాంకులు రుణాలివ్వాలంటే కౌలు రైతు గుర్తింపు కార్డులు తప్పనిసరిగా ఉండాలి. ఈ కార్డుల జారీ ప్రక్రియ కొత్త ప్రభుత్వంలో నత్తనడకన సాగుతోంది. ఈ సారి తొలకరి సాగుకు అడుగడుగునా అడ్డంకులే ఎదురవుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 75,560 కౌలు సాగు హక్కు పత్రాలకు ఇప్పటి వరకు 42,314 కార్డులను పంపిణీ చేశారు. మిగిలిన 33,246 కార్డుల కోసం కౌలు రైతులు ఎదురుచూస్తున్నారు. మరో వైపు ఈ ప్రభుత్వంలో పాలసీలు మారితే తమకు రుణాలు అందుతాయో లేదోనన్న ఆందోళన వారిని మరింత కుంగదీస్తోంది. ప్రస్తుత పంటల సాగుకు బయట వ్యక్తుల నుంచి అధిక వడ్డీలకు అప్పులు తెచ్చుకుని సాగు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

కౌలు రైతుకు సాగు హక్కు పత్రాల పంపిణీ వివరాలు

మండలం	పంపిణీ లక్ష్యం	పంపిణీ చేసినవి	నమోదు శాతం
భీమడోలు	4,662	2,737	59
ఉంగుటూరు	6,334	3,237	51
నిడమర్రు	2,116	1,824	86
ద్వారకాతిరుమల	3,590	2,655	74

11 నెలల కాలపరిమితితో కౌలు కార్డులు

పాత చట్టాలకు స్వస్తి పలికి 2019లో భూ సాగు హక్కుల చట్టాన్ని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకు వచ్చింది. ఈ పథకంలో భూ యాజమానులు, కౌలు రైతులకు బహుళ ప్రయోజనాలు చేకూరాయి. రెవెన్యూ, వ్యవసాయ అధికారులు సంయుక్తంగా గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి రైతులివ్వాల్సింది. కౌలు రైతులు తమ యాజమాని అంగీకార పత్రం, సాగు చేసే సర్వే నంబర్, అందులోని భూమి వివరాలు, వీఆర్వో సంతకం కలిగి ఉంటే వారికి సాగుహక్కు కార్డులను అందిస్తారు. వాటిని కాల పరిమితి 11 నెలల మాత్రమే ఉంటుంది. కౌలు సంఘాల నాయకులు మాత్రం భూ యాజమాని అంగీకారం పత్రం లేకుండా నేరుగా కౌలు రైతులకు సాగు హక్కు కార్డులను అందించాలని డిమాండ్ చేస్తున్నారు. సబ్సిడీ విత్తనాలు, బ్యాంకు రుణాలు, పంట నష్టపరిహారం, ఉత్పత్తి విక్రయాలు నిర్వహించుకోవాలంటే కౌలు రైతులకు గుర్తింపు కార్డులు తప్పనిసరిగా అవసరం.

భీమడోలు సబ్ డివిజన్ పరిధిలో

భీమడోలు సబ్ డివిజన్ పరిధిలోని భీమడోలు, ద్వారకాతిరుమల, ఉంగుటూరు, నిడమర్రు మండలాల్లో 16,702మందికి కౌలుకార్డులు పంపిణీచేయాలన్న లక్ష్యంగా నిర్ణయించారు. ఇప్పటివరకు 63 శాతం కార్డులు రైతులకు అందించారు. దీనితో వరి, ఉద్యానవన పంటలు, కూరగాయాలు పంటలు పండించే రైతులు, కౌలు రైతులకు మేలుజరుగుతుంది.

అర్హులందరికీ కౌలు కార్డులు ఇవ్వాలి



భూ యాజమానితో సంబంధం లేకుండా అర్హతే ప్రామాణికంగా ప్రతి కౌలు రైతుకు సాగు హక్కు పత్రాలు అందించాలి. 2014లో చంద్రబాబు ప్రభుత్వం రైతు రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చి అమలులో పలు కొర్రీలు పెట్టి రైతు రుణమాఫీని కుదించింది. దీనితో అప్పట్లో రైతుమిత్ర, జేఎల్‌జీల్లోని కౌలు రైతులకు రుణమాఫీ పథకాన్ని అమలు చేయలేదు. భూ యాజమాని అంగీకారం లేకుండా కౌలు రైతు సాగు చేసే భూమి సర్వే నంబర్ ఆధారంగా కౌలు కార్డులు ఇవ్వాలి

– వెజ్జు శ్రీరామచంద్రమూర్తి, కౌలు రైతు సంఘం మండల కన్వీనర్, పూళ్ల

చురుగ్గా కార్డుల పంపిణీ



కౌలు సాగు హక్కుపత్రాలు పంపిణీ కార్యక్రమం చురుగ్గా సాగుతోంది. భీమడోలు సబ్ డివిజన్ పరిధిలో 63శాతం మంది రైతులు, కౌలు రైతులకు కార్డులను అందించాం. దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హతే ప్రామాణికంగా కార్డులను తక్షణమే అందిస్తున్నాం. కౌలు సాగు హక్కు పత్రాలతో అనేక ప్రయోజనాలున్నందున సాగుదారులు విధిగా పత్రాలు పొందాలి. గ్రామంలోని వీఆర్వో, వీఏఏలను రైతుల సంప్రదించాలి.

– డాక్టర్ పి.ఉషారాజకుమారి, ఏడీఏ, భీమడోలు

క్లుప్తంగా

కైకరం జెడ్పీ హైస్కూల్లో శిక్షా సప్తాహ్



విద్యార్థులకు సాంకేతిక అంశాలను వివరిస్తున్న ఉపాధ్యాయిని

ఉంగుటూరు: కైకరం జిల్లా పరిషత్ హైస్కూల్లో శిక్షా సప్తాహ్ కార్యక్రమం 5వ రోజు నిర్వహించారు. హెచ్ఎం గుళ్ల ప్రసాదరావు పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలు అంశాలను విద్యార్థులకు వివరించారు. పెన్ డ్రైవ్, కేబుళ్లను అనుసంధానం చేయడాన్ని తెలియజేశారు. ప్రభుత్వం పంపిణీ చేసిన ట్యాబ్‌లతో బైజ్యూస్ పాఠ్యాంశాలను వినియోగించేలా ప్రోత్సహించారు. పాఠశాలలోని కంప్యూటర్ ల్యాబ్‌ను విద్యార్థులే స్వయంగా ఆపరేట్ చేసి వినియోగించేలా శిక్షణ ఇచ్చారు. ఉపాధ్యాయులు కె.జాన్, జి.పోసియ్య పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బీవీ శ్రీలక్ష్మి, ప్రిన్సిపాల్ శ్రీనివాస్

ఉంగుటూరు: బాల్యవివాహాల వల్ల చిన్న వయస్సులోనే రక్తహీనత ఏర్పడి మహిళల ప్రాణానికి ప్రమాదం సంభవిస్తుందని, ఐసీడీఎస్ సూపర్‌వైజరు బీవీ శ్రీలక్ష్మి అన్నారు. వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. నారాయణపురం మహాత్మాగాంధీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బేటీ బచావో– బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. బాలికలు చదువుకోవడం ద్వారా విజ్ఞానవంతులు అవుతారని మహాత్మాగాంధీ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బి శ్రీనివాస్ అన్నారు. లైంగిక వేధింపులపై ఫిర్యాదు చేయడం, దిశ చట్టంపై మహిళా పోలీసు సీహెచ్ ఫణిత అవగాహన కల్పించారు. సమాజంలో మహిళల పాత్ర, వారు సాధిస్తున్న విజయాలను అధ్యాపకురాలు ఇ.హేమ వివరించారు. మహిళా పోలీసు డి. అనూష, అంగన్‌వాడీ కార్యకర్త సౌదామణి పాల్గొన్నారు.

ముమ్మరంగా కుష్టు వ్యాధి సర్వే



కాశిపాడులో కుష్టువ్యాధి గుర్తింపు పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

గణపవరం: కుష్టువ్యాధి సర్వే పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని పిప్పర పీహెచ్‌సీ వైద్యాధికారి కె.ప్రియాంక అన్నారు. శుక్రవారం గణపవరం మండలం పిప్పర పీహెచ్‌సీ పరిధిలోని కాశిపాడులో వైద్య సిబ్బంది కుష్టువ్యాధి సర్వే నిర్వహించారు. కుష్టు వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తిస్తే నివారణ సులభతరమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో వెంకటేశ్వర్లు, ఆరోగ్య సహాయకుడు నామాలరాజు, నాగమణి, జేమ్స్ పాల్గొన్నారు.

వరద బాధితులకు సాయం

గణపవరం: పిప్పరలో భారీ వర్షాలు, ఎర్ర కాలువ వరదల కారణంగా ముంపునకు గురైన ప్రాంతాల్లోని బాధిత కుటుంబాలకు సామాజిక కార్యకర్త, కొలనువాడ సుబ్బరాజు రూ. 500 చొప్పున ఆర్థిక సహాయం అందించారు. పిప్పర విద్యుత్ సబ్‌స్టేషన్ ఏరియా, ఆరవ వార్డు, ఎస్సీ ఏరియాలో ఇళ్లలోకి వరదనీరు ప్రవేశించి పలు కుటుంబాలు వారు ఇబ్బందులు పడ్డారు.

భర్తపై భార్య ఫిర్యాదు

ఏలూరు టౌన్: బ్యాంకులో తన పేరుతో క్రెడిట్ కార్డు తీసుకుని రూ.2.50 లక్షలు ఖర్చు చేశాడంటూ బాధితురాలు తన భర్తపై ఏలూరు టూటౌన్ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం మేరకు విశాఖపట్టణంలోని కింగ్ జార్జి ఆసుపత్రిలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న కె.సువర్ణకు ఏలూరుకు చెందిన మున్నాల సందీప్‌తో 2018 ఫిబ్రవరి 27న వివాహమైంది. కొంతకాలం తరువాత వీరి మధ్య మనస్పర్థలు రావడంతో వేర్వేరుగా ఉంటున్నారు. 2023 డిసెంబరులో వ్యక్తిగత అవసరాలు నిమిత్తం బ్యాంకు నుంచి రుణం తీసుకునేందుకు సువర్ణ తన సిబిల్ స్కోరును తనిఖీ చేయించగా ఏలూరులోని ఒక బ్యాంకులో క్రెడిట్ కార్డు ద్వారా రూ.2.50 లక్షలు బకాయి ఉన్నట్లు తెలిసింది. దీనిపై బ్యాంకు అధికారులతో విచారణ చేయగా ఆమె ఖాతాలో క్రెడిట్‌కార్డు తీసుకున్న భర్త అతని ఫోన్ నంబర్ ద్వారా లావాదేవీలు నిర్వహించినట్టు తెలిసింది. దీంతో సువర్ణ తన భర్త సందీప్‌పై చీటింగ్ కేసు పెట్టింది. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

నేటి నుంచి కల్యాణోత్సవాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : సనాతన భాగవత భక్త సమాజం ఆధ్వర్యంలో ఈ నెల 27వ తేదీ నుంచి మూడు రోజుల పాటు దేవతా కల్యాణ మహోత్సవాలు నిర్వహించనున్నట్టు సత్య సాయి సేవా సంస్థల ఏలూరు జిల్లా అధ్యక్షుడు కానుమిల్లి శశి శేఖరరావు తెలిపారు. రామకృష్ణాపురంలోని శ్రీ సత్యసాయి సేవా కేంద్రంలో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

మహిళా సాధికారతతోనే దేశాభివృద్ధి సాధ్యం



గుండుగొలనులో నూతన చట్టాలపై అవగాహన కల్పిస్తున్న మహిళా న్యాయవాది టి.రాణి

భీమడోలు: మహిళా సాధికారతతోనే దేశాభివృద్ధి సాధ్యమని మహిళా న్యాయవాది టి.రాణి అన్నారు. మాతా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహిళా సాధికారత బేటీ బచావో, బేటీ పడావో అంశంపై వంద రోజుల ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో భాగంగా గుండుగొలను జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పాఠశాల బాలికలు, మహిళా టీచర్లకు అవగాహన సదస్సును నిర్వహించారు. హెచ్ఎం గారపాటి కనకదుర్గా సునీత అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నూతనంగా అమల్లోకి వచ్చిన నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. మహిళా, బాలికల చట్టాలపై వారికి అవగాహన కల్పించి చైతన్యవంతులు కావాలని సూచించారు. ముఖ్య అతిథిగా హాజరైన న్యాయవాది టి.రాణి మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగాను, సామాజికంగా, రాజకీయంగా స్వావలంబన సాధించాలన్నారు. హెచ్ఎం గారపాటి కనకదుర్గా సునీత మాట్లాడుతూ చట్టాలను కఠినంగా అమలు చేయడం ద్వారా మహిళలకు పూర్తి భద్రత, రక్షణ అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు షహనాజ్ బేగం, ఎం.కవిత, నూర్జహాన్, మహిళా కానిస్టేబుల్స్ టి.అరుణ, వాసవి, ప్రసన్న, అంగన్‌వాడీ కార్యకర్తలు బోడ రాజమణి, బాలికలు,మహిళా టీచర్లు పాల్గొన్నారు.

పోతునూరు ఉన్నత పాఠశాలలో...

దెందులూరు: మిషన్ శక్తి ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్, 100 రోజుల ప్రత్యేక అవగాహన సమావేశాలు విజయవంతం కావాలని పెదపాడు ఐసీడీఎస్ సీడీపీఓ కే.విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం పోతునూరు ఉన్నత పాఠశాలలో సూపర్‌వైజర్లు శ్రీదేవి, చిట్టెమ్మ, పద్మభూషణం ఆధ్వర్యంలో మహిళా కేంద్రీకృత చట్టాలపై పారా లీగల్ పర్సనల్ లాయర్ ఐ.కృష్ణవేణి అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన సీడీపీఓ మాట్లాడుతూ విద్యార్థినులు, మహిళలు, మహిళా కేంద్రీకృత చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. పాఠశాల హెచ్ఎం షేక్ వలీ ఉన్నారు.

దోమల ద్వారా వ్యాధుల వ్యాప్తి



కుండీల్లో నిల్వనీటిని తొలగించేందుకు చర్యలు తీసుకున్న లక్ష్మణరావు

గణపవరం: పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత ద్వారా మాత్రమే అంటువ్యాధులకు దూరంగా ఉండవచ్చునని, దీనికి ప్రజలు, వైద్య సిబ్బంది సమష్టి కృషి అవసరమని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారిణి పి.కిరణ్మయి అన్నారు. శుక్రవారం గణపవరం-3 గ్రామ సచివాలయంలో నిర్వహించిన డెంగీ అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం భారీ వర్షాలు, వరదల కారణంగా అంటు వ్యాధులు విజృంభిస్తున్నాయని తెలిపారు. దోమల కారణంగానే మలేరియా, టైఫాయిడ్, చికెన్ గున్యా, డెంగీ తదితర వ్యాధులు వస్తాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సీహెచ్‌వో జాలాది విల్సన్ మాట్లాడుతూ ప్రజలు పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. వైద్యసిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నిల్వ నీటిలో దోమలు వృద్ధి

ఉంగుటూరు: నిల్వ నీటిలో దోమలు వృద్ధి చెందుతాయని, ఇంటి పరిసరాలను శుభ్రంగా, పొడిగా ఉంచాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.లక్ష్మణరావు సూచించారు. నారాయణపురంలో దోమల నివారణకు వైద్య సిబ్బంది చేస్తున్న పనులను లక్ష్మణరావు పరిశీలించారు. వారంలో ఓరోజు డ్రైడే పాటించాలన్నారు. గ్రామ ఆరోగ్య కార్యకర్తలు సూర్యకుమారి, సహాయకులు రేలంగి పార్థ సారధి, ఆశా కార్యకర్తలు, అంగన్ వాడీలు, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి హామీ సొమ్ము రికవరీ



ప్రజావేదికలో ఇంజినీరింగ్ అధికారులను ప్రశ్నిస్తున్న ఏపీడీ పురుషోత్తమ్

ఏలూరు రూరల్ : ఉపాధి హామీ పనుల్లో జరిగిన అవకతవకల నుంచి రూ.12,824లు రికవరీకి ఆదేశించామని డ్వామా ఏపీడీ పురుషోత్తమ్ చెప్పారు. శుక్రవారం ఏలూరు మండల పరిషత్ ఆవరణలో ఏలూరు మండలంలో గతేడాది నిర్వహించిన ఉపాధి హామీ పథకం పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. సోషల్ ఆడిట్ సిబ్బంది క్షేత్ర స్థాయిలో పర్యటించి ఉపాధి పనులపై సేకరించిన సమాచారాన్ని ఏపీడీ ఎదుట వెల్లడించారు. గ్రామ పంచాయతీల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఏపీడీ పురుషోత్తమ్ మాట్లాడుతూ ఉపాధి పనుల్లో అవకతవకలకు సంబంధించి ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి రూ.12,824లు రికవరీ చేయాలని ఆదేశించారు. పలువురు ఫీల్డ్ అసిస్టెంట్లకు రూ.3000 జరిమానా విధించామని, మరో రూ.40,332ల పనులపై రీ వెరిఫికేషన్‌కు ఆదేశించామని తెలిపారు ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్ల ఉదాసీనత కారణంగా పలు గ్రామాల్లో కూలీలు రూ.2010 వేతనం నష్టపోయారని చెప్పారు. మొత్తంగా 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు రూ.15,83,13,974ల ఉపాధి నిధులతో పనులు పూర్తయ్యాయన్నారు. ఇందులో కూలీలకు రూ.11,45,15,795లు వేతనాల రూపంలో అందాయని, మిగిలిన రూ.4,37,98,179లు మెటీరియల్ రూపంలో అభివృద్ధి పనులు నిర్వహించారని చెప్పారు. మొత్తంగా 1,223 పనులు చేపట్టగా, ఇందులో ఈజీఎస్ శాఖ ద్వారా 1,150 పనులు, పంచాయతీరాజ్ ద్వారా 72 పనులు, ఆర్ డబ్ల్యూఎస్ శాఖ ద్వారా ఒక పని ఉందని వివరించారు. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 7 గంటల వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎస్ఆర్‌పీ సూర్యచక్రం, డీవీఓ విజయలక్ష్మి, అంబుడ్స్‌మన్, అబ్దుల్‌ఖాన్, ఎంపీడీఓ ప్రణవి, డీఆర్‌డీఓ నాగరాజు, ఏలూరు ఏపీడీ సుధాకర్, మండల ఏపీఓ కిషోర్, ఫీల్డ్ అసిస్టెంట్లు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

కార్గిల్ అమర వీరులకు జోహార్లు



దెందులూరు నర్సింగ్ కళాశాలలో కార్గిల్ అమరవీరులకు నివాళులర్పిస్తున్న దృశ్యం

దెందులూరు: కార్గిల్ యుద్ధంలో అమరులైన జవానులందరికీ యావత్ భారతదేశం రుణపడి ఉందని నర్సింగ్ సీనియర్ స్టూడెంట్ కావ్య అన్నారు. శుక్రవారం దెందులూరు నర్సింగ్ కళాశాలలో కరస్పాండెంట్ సుగ్గిశెట్టి నూకరాజు ఆధ్వర్యంలో కార్గిల్ విజయదినోత్సవం నిర్వహించారు. 1999 మే 3న కార్గిల్ జిల్లాలో నియంత్రణ రేఖ వెంబడి భారత్–పాకిస్థాన్ మధ్య జరిగిన కార్గిల్ యుద్ధంలో 527 మంది భారత సైనికులు అమరులయ్యారని తెలిపారు. జూలై 26న భారత సైన్యం ఆక్రమణకు గురైన దేశ భూభాగాన్ని స్వాధీనం చేసుకుందన్నారు. చరిత్ర ఉన్నంతకాలం కార్గిల్ అమరవీరుల ప్రాణత్యాగం దేశం స్మరించుకుంటుందని అన్నారు.

కార్గిల్ అమర వీరుల పోరాటం స్ఫూర్తిదాయకం



భీమడోలు బాలికల కళాశాలలో మాట్లాడుతున్న సీఐ గిరిజ సత్యకుమారి

భీమడోలు: కార్గిల్ అమర వీరుల పోరాట పటిమ నేటి యువతకు స్ఫూర్తిదాయమని భీమడోలు ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ గిరిజ సత్యకుమారి అన్నారు. భీమడోలులో మాధురి బాలికల జూనియర్ కళాశాలలో శుక్రవారం కార్గిల్ విజయ దివాస్‌ను పురస్కరించుకుని కార్గిల్ యుద్ధంలో మరణించిన అమర వీరులకు ఆమె నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమానికి కళాశాల ఇన్‌చార్జి పెనుమూడి బాలు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన గిరిజ సత్యకుమారి మాట్లాడుతూ కార్గిల్ యుద్ధం జరిగి 25 ఏళ్లు పూర్తయ్యిందని, పాకిస్తాన్‌పై భారత సైనికులు అలుపెరగని రీతిలో యుద్ధం చేసి దేశానికి విజయాన్ని అందించారన్నారు. నేటి సమాజంలో యువత మాదక ద్రవ్యాలకు బానిసలై తమ బంగారు భవిష్యత్తును సర్వనాశనం చేసుకుంటున్నారని అన్నారు. చెడు అలవాట్లను విడనాడి చక్కగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించి తల్లిదండ్రులు, అధ్యాపకులకు మంచి గుర్తింపు తీసుకుని రావాలన్నారు. ప్రిన్సిపాళ్లు అశోక్, కేసరి, అధ్యాపకులు, సిబ్బంది, యువతులు పాల్గొన్నారు.

అమ్మవార్లకు ఆషాఢం సారె సమర్పణ

దెందులూరు: ఉండ్రాజవరంలో ఆషాఢమాసం సందర్భంగా శుక్రవారం మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ గ్రామంలో వేంచేసియున్న దుర్గమ్మ, సోమాలమ్మ, పుంతల ముసలమ్మవార్లకు గ్రామంలోని మహిళలంతా అధిక సంఖ్యలో పాల్గొని సారె సమర్పించారు. పసుపు, కుంకుమ, సున్నిపిండి, పూలు, పండ్లు, గాజులు, చలిమిడి, నూతన వస్త్రాలు, 27 రకాల స్వీట్లు, పరిమళ ద్రవ్యాలతో పాటు అలంకరణ సామగ్రిని సారెలో సమర్పించారు. ఆలయ అర్చకులు అమ్మవార్లకు విశిష్ట అలంకరణ చేశారు. గ్రామంలోని మహిళలందరూ సారె కార్యక్రమంలో పాల్గొనడంతో అమ్మవార్ల ఆలయం సందడిగా మారింది.

చిన్నారులను బడిలో చేర్పించాలి



గోపన్నపాలెం పాఠశాలలో ఉపాధ్యాయులను అభినందిస్తున్న ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ రాధాకృష్ణ

దెందులూరు: గోపన్నపాలెం శివారు ప్రాంతాల్లో బడి బయట ఉన్న చిన్నారులను గుర్తించి వారిని పాఠశాలలో చేర్పించేందుకు ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయమని ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ రాధాకృష్ణ, ఎంఈఓ ఎవీఎస్‌వీ ప్రసాద్ అన్నారు. శుక్రవారం గోపన్నపాలెం ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం ఎం.మనోహర్, ఉపాధ్యాయులు బడి బయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించారు. ఈ ప్రక్రియను కోఆర్డినేటర్ రాధాకృష్ణ, ఎంఈఓ ఎవీఎస్‌వీ ప్రసాద్ పర్యవేక్షించారు.

వ్యక్తి ఆత్మహత్య

ఏలూరు టౌన్: తీవ్ర మానసికవేదనతో ఒక వ్యక్తి పురుగుమందు తాగి అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు ఏలూరు సమీపంలోని శనివారపుపేటకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి గొల్లపల్లి రమేష్ (35)అనే వ్యక్తికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. రమేష్ నాలుగు నెలల క్రితం వరకు వంగాయగూడెంలోని నివాసం ఉండేవాడు. ఆ సమయంలో ఆ ప్రాంతంలోని ఒకరి వద్ద రూ.లక్షల్లో వడ్డీకి అప్పు తీసుకున్నాడు. బాకీపై వారు నిలదీశారు. ఈనెల 23న సమస్య పరిష్కారం కోసం పెద్దల సమక్షంలో చర్చించగా, తాను వడ్డీలు కూడా చెల్లించలేనని తనకు చావే మిగిలిందంటూ వారిని బెదిరించి వెళ్లిపోయాడు. పురుగుమందు తాగేసి తీవ్ర అస్వస్థతకు గురికావడంతో అతన్ని ఏలూరు ఆంధ్రా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఈ ఘటనపై ఏలూరు వన్ టౌన్ సీఐ ఎస్ రాజశేఖర్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టారు.

డిజిటల్ విద్యపై అవగాహన



గాంధీనగర్ మున్సిపల్ పాఠశాలలో ఐఎఫ్‌పీ ప్యానెలపై అవగాహన కలిగిస్తున్న ఉపాధ్యాయుడు



విమలాదేవి మున్సిపల్ పాఠశాలలో ట్యాబ్‌లో పాఠాలు ఆలకిస్తున్న విద్యార్థులు

ఏలూరు(ఆర్ఆర్‌పేట): జాతీయ విద్యావిధానం (ఎన్ఎస్ఈపీ)–2020 నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా శిక్షా సప్తాహ్ కార్యక్రమాల్లో భాగంగా నాలుగో రోజు శుక్రవారం సాంకేతిక నైపుణ్యాల దినోత్సవం నిర్వహించారు. సాంకేతికత ఆధారంగా విద్యాభ్యాసం, డిజిటల్ పరికరాల వినియోగంలో అవగాహన, ట్యాబ్‌ల ద్వారా పాఠ్యాంశాల బోధన, తరగతి గదిలో ఐఎఫ్‌పీ ప్యానల్‌ల వినియోగం తదితర అంశాలపై ఉపాధ్యాయులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. చిన్ననాటి నుంచే డిజిటల్ విద్యపై అవగాహన కలిగి ఉండడం ద్వారా భవిష్యత్‌లో సాఫ్ట్‌వేర్ రంగంలో విద్యార్థులకు మరింత నైపుణ్యం పెరుగుతుందని చెప్పారు.

సీతంపేటలో విద్యార్థినికి డెంగీ నిర్ధారణ

దెందులూరు: దెందులూరు మండలం సీతంపేట పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న విద్యార్థినికి డెంగీ నిర్ధారణ అయింది. గ్రామంలో పది మంది ఇప్పటి వరకు ఏలూరు, దెందులూరు, భీమడోలు సీహెచ్‌సీలు, జనరల్ ఆసుపత్రుల్లో ప్లేట్‌లెట్లు పడిపోయి ఇన్‌పేషెంట్స్‌గా చేరి చికిత్స పొందుతున్నారు. మండలంలో 17 పంచాయతీల్లో పది రోజులుగా దెందులూరు సీహెచ్‌సీ, పోతునూరు పీహెచ్‌సీ, గోపన్నపాలెం పీహెచ్‌సీ పరిధిలో 200 మందికిపైగా వైరల్ జ్వరాల బారినపడ్డారు.

డెంగీ వాస్తవమే : డీఎంఅండ్‌హెచ్ఓ

దెందులూరు మండలం సీతంపేటలో పాఠశాల విద్యార్థినికి డెంగీ జ్వరం రావడం వాస్తవమనేని శుక్రవారం రాత్రి డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ శర్మిష్ట ధ్రువీకరించారు. జ్వర బాధితులు ప్రభుత్వ వైద్యశాలల్లో వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. సీతంపేటలోని గేటు పక్కన ఉన్న దళితపేటలో తక్షణమే మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలని బాధిత కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఆరా

సీతంపేటలో డెంగీ, వైరల్ జ్వరాల వ్యాప్తిపై మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి స్థానిక నాయకులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. తక్షణ చర్యలు నిమిత్తం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారులు, ఉన్నతాధికారులతో మాట్లాడతానని ఆయన అన్నారు.

మార్కెట్ యార్డు సహాయకుడు బాలాజీ మృతి

ఉంగుటూరు: ఉంగుటూరు మార్కెట్ యార్డు సహాయకుడిగా పనిచేస్తున్న టేకి బాలాజీ (42) శుక్రవారం మృతి చెందారు. ఈయన 27 ఏళ్ల నుంచి అవుట్ సోర్సింగు విధానంలో సహాయకుడిగా చెక్ పోస్టులో పని చేస్తున్నారు. వెల్లమిల్లి చెక్‌పోస్టు వద్ద చాలాకాలంగా బాలాజీ పని చేశాడు. ఇతని ఆరోగ్యం క్షీణించడంతో చికిత్స కోసం కుటుంబ సభ్యులు హైదరాబాదు తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన మృతి చెందారు. మార్కెట్ యార్డు సూపర్‌వైజర్ గోపి, తోటి ఉద్యోగులు వచ్చి బాలాజీ భౌతికకాయం వద్ద నివాళులర్పించారు.

సీజీఆర్ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ సత్యనారాయణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్ఎఫ్)ను సద్వినియోగం చేసుకోవాలని ఏపీఈపీడీసీఎల్ సీజీఆర్ఎఫ్ చైర్మన్ బి.సత్యనారాయణ అన్నారు. గురువారం ఏలూరు నగరంలో నిర్వహించిన పరిష్కార వేదిక సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యుత్ సిబ్బంది తమ సేవలను సక్రమంగా నిర్వహించకపోయినా, వినియోగారుని సమస్య నిర్ణీత కాల వ్యవధిలో సమస్యలు పరిష్కరించని పరిస్థితిలో బాధితులు న్యాయం కోసం తమను సంప్రదించాలని అన్నారు. విద్యుత్ బిల్లుల్లో తేడాలు, కేబుల్ సమస్యలు, ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు, లో ఓల్టేజ్ సమస్యలు, అదనపు లోడు మంజూరు, విద్యుత్ సర్వీస్ యజమాని పేరు మార్పు, కేటగిరి మార్పిడి వంటి సమస్యలను వినియోగదారులు ఆన్‌లైన్ ద్వారా సీజీఆర్ఎఫ్‌కి ఫిర్యాదు చేసి పరిష్కరించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా పలువురు వినియోగదారులు తమ సమస్యలను వేదిక దృష్టికి తీసుకొచ్చారని చెప్పారు. కార్యక్రమంలో వేదిక సభ్యులు వి.జనార్ధనరావు, రాయసం సురేంద్ర కుమార్, ఏలూరు సర్కిల్ ఈఈ టెక్నికల్ ఎం ఝాన్సీ, ఏలూరు ప్రాంత విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.